www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 25 నవంబర్ 2024
5
పశ్చిమ గోదావరి

మహిళలకు రక్షణ కల్పించాలి : ఐద్వా

తణుకు: బాలికలు, మహిళలపై రోజురోజుకీ హింస పెరుగుతుందని, దాన్ని అరికట్టాల్సిన ప్రభుత్వాలు ఏమీ పట్టనట్లు ఉంటున్నాయని ఐద్వా పట్టణ కార్యదర్శి కె.నాగరత్నం ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో తణుకు డిగ్రీ హాస్టల్‌లో ఆదివారం 'మహిళలపై హింస వ్యతిరేకించాలి' పేరిట సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరత్నం మాట్లాడుతూ వైజాగ్‌లో లా విద్యార్థినిపై తోటి విద్యార్థులు చేసిన అఘాయిత్యం దారుణమని, వీటిని నిరోధించడానికి పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని కోరారు. పసిపిల్లలకూ రక్షణ లేకుండా పోయిందన్నారు. చట్టాలు కఠినంగా అమలు చేసి మహిళల్ని కాపాడాల్సిన ప్రభుత్వాలు ఆ దిశగా పని చేయడం లేదని వాపోయారు. ఎక్కడైనా అలాంటి ఘటన జరిగితే మహిళా సంఘాలు ఎన్ని పోరాటాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా రానున్న రోజుల్లో ఐద్వా చేపట్టే కార్యక్రమాల్లో అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ వైద్యుల తీరు.. జనం బేజారు..!

జిల్లాలో అర్హత లేకుండానే కొందరు ఆర్ఎంపిలు, పిఎంపిలుగా చెలామణి

హంగు, ఆర్భాటంగా క్లినిక్‌లు.. అవసరం లేకున్నా పరీక్షలు

వైద్య ఆరోగ్య శాఖ నిర్లిప్తతపై సర్వత్రా విమర్శలు

'వైద్యో నారాయణో హరి' అన్నారు పెద్దలు.. అంతటి ప్రాముఖ్యత గల వైద్యులు గ్రామాల్లో ఎవరంటే ఠక్కున చెప్పేది ఆర్ఎంపిల గురించే. ఆరోగ్యానికి సంబంధించి ఏ చిన్నపాటి సమస్య వచ్చినా వెంటనే వెతికేది మన ఊళ్లోని ఆర్ఎంపినే. ఆర్ఎంపిలు లేని గ్రామాలు లేవంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే కీలక సమయాల్లో వారు అందించే చికిత్సే చాలా కీలకం. అందుకే గ్రామాల్లో ఆర్ఎంపిలను జనం తమ కుటుంబ సభ్యుల్లో ఒకరిగా భావించి తమ సమస్యలన్నీ చెప్పకుంటారు. అంతటి ప్రాముఖ్యత గల ఆర్ఎంపిలకు చెడ్డ పేరు తీసుకొస్తున్నారు కొందరు ఆర్ఎంపిలు, పిఎంపిలుగా చెప్పకునే నకిలీ వైద్యులు.

సీజ్ చేసిన మెడికల్ షాప్

ప్రజాశక్తి - నరసాపురం

ఇటీవల జిల్లాలోని పెనుగొండ మండలం సోమరాజుచెరువు గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకున్నా ఓ నకిలీ వైద్యుడు వైద్యం చేస్తున్న విషయం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. అంతకుముందు మొగల్తూరు మండలం కాళీపట్నంలో ఒక పిఎంపి నిర్లక్ష్యం వల్ల ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురైతే సమీప పట్టణంలోని ప్రయివేటు ఆసుపత్రిలో వేలాది రూపాయలు చెల్లించి చికిత్స పొందాల్సి రావడం, దానిపై ఆ బాధితుని కుమార్తె డిఎంహెచ్‌కు ఫిర్యాదు చేయడం కూడా జరిగింది. దీనిపై మొగల్తూరు పోలీసు స్టేషన్‌లో సదరు పిఎంపిపై కేసు సైతం నమోదైంది. అంతకుముందు కొన్నేళ్ల క్రితం నరసాపురంలో అనుమతి లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్న వైద్యుడిని అదుపులో తీసుకుని క్లినిక్‌ను మూసివేసిన ఘటన చోటుచేసుకుంది. ఇలా చెప్పుకుంటూ పోతే నకిలీ వైద్యుల లీలలు చాలానే ఉన్నాయి.

ఇదే పరిస్థితి ఇప్పటికీ పలు గ్రామాలతోపాటు పట్టణాల్లోనూ కొనసాగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. నరసాపురం పట్టణంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఇంట్లో మెడికల్ షాప్ వద్ద ఒక డాక్టర్ నాలుగు నుంచి ఆరు వరకూ బెడ్‌లు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. పట్టణంలోనే, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ పని చేసే కేంద్రంలోనే పలువురు నిబంధనలకు విరుద్ధంగా.. అర్హత లేకుండా వైద్యం చేస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు. ఏదైనా ఘటన జరిగినప్పుడు, లేదా ఏదైనా ఫిర్యాదు వస్తేనే స్పందించడం తప్ప నిరంతర నిఘా నకిలీ వైద్యులపై ఉండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో నకిలీ వైద్యులు హల్‌చల్ చేయడం ఈ కాలంలో బాగా పెరిగిందనే చెప్పొచ్చు.

ఆర్ఎంపిలు తమ వద్దకు వచ్చే రోగులకు ప్రాథమిక వైద్యం మాత్రం చేయాలి. శరీర వేడి (టెంపరేచర్) ఎంత ఉందో నిర్ధారించాలి. అవసరమైతే పారాసిట్మల్ వంటి ఒకటి, రెండు మాత్రలు ఇచ్చి నిపుణులైన వైద్యుల వద్దకు వెళ్లాలని సూచించాలి. వాస్తవానికి ఆర్ఎంపిలు రోగులకు ఇంజక్షన్లు చేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. అయితే ప్రభుత్వాసుపత్రులకు వెళ్లలేని పరిస్థితి, ప్రయివేటు ఆసుపత్రికి వెళ్తే సొమ్ము కట్టలేని పరిస్థితుల్లో ఆర్ఎంపిలను పేదలే ఇంజక్షన్ చేయాలని కోరుతున్న పరిస్థితులు కూడా ఉన్నాయి. అయితే ఎక్కువ మంది ఆర్ఎంపిలు తమ వృత్తిని సేవాదృక్పథంతోనే సాగిస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు గ్రామాల్లో సేవలందిస్తున్నారు. ఎవరి వద్దనైనా సొమ్ము లేకపోయినా ముందు చికిత్స అందించి తర్వాత డబ్బు ఉన్నప్పుడు తీసుకునే ఆర్ఎంపిలు కూడా గ్రామాల్లో ఎక్కువే. అందుకే ఆర్ఎంపిలు లేని గ్రామాలను ఊహించలేమని అంటుంటారు. అయితే ఇదే సందర్భంలో కొంతమంది ఆర్ఎంపిలు, పిఎంపిలు మాత్రం సంపాదనే ధ్యేయంగా పేదలను పీల్చి పిప్పి చేస్తున్నారు. అవసరం లేకపోయినా సెలైన్ పెట్టడం, ఇంజెక్షన్‌లు చేయడం వంటివి చేస్తున్నారు. మరికొన్ని చోట్ల అవసరం లేకపోయినా, అర్హత లేకపోయినా పరీక్షలు సైతం చేయిస్తున్నారు. మండల కేంద్రాలు, పట్టణాల్లో కొన్ని క్లినిక్‌ల్లో అయితే ఎటువంటి అనుమతి, అర్హత లేకుండా ఆపరేషన్లు సైతం చేయడం ఆందోళన కల్గిస్తోంది. ఈ నకిలీ వైద్యులే మెడికల్ దుకాణాలు సైతం నిర్వహిస్తుండడం విశేషం. ఒక్కో ఇంజక్షన్‌కు రూ.వంద, సెలైన్ పెడితే రూ.500 వరకూ వసూలు చేస్తున్నారు. ఆర్ఎంపిగా కొనసాగాలంటే తప్పనిసరిగా శిక్షణ పొంది ప్రాక్టీస్ చేయడానికి అనుమతిపత్రం పొంది ఉండాలి. అయితే అందుకు విరుద్ధంగా ఎటువంటి శిక్షణ, సర్టిఫికెట్ లేకుండా యథేచ్ఛగా ప్రయివేటు క్లినిక్‌లు నడుపుతుండడం గమనార్హం. మరోవైపు సంపాదనే ధ్యేయంగా మారిన కొందరు ఆర్ఎంపిలు, పిఎంపిలు పట్టణాల్లోని బడా ఆస్పత్రులతో సంబంధాలు పెట్టుకుని ఏజెంట్లుగా వ్యవహరిస్తూ భారీగా కమీషన్లు దండుకుంటున్నారు. ఇదంతా ఎటువంటి అర్హత, అనుమతి లేని నకిలీలు సాగిస్తున్న నిర్వాకాలు. ఎవరికైనా వైద్యం వికటించి రోగులకు ప్రాణహాని జరిగినప్పుడు మాత్రమే పోలీసులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హడావుడీ చేస్తుంటారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని చెబుతారుగానీ తర్వాత ఎటువంటి చర్యలూ కానరాని పరిస్థితి. ఇంత జరుగుతున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు ప్రయివేటు క్లినిక్‌లపై దాడులు చేస్తున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నకిలీ వైద్యులపై చర్యలు చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులు నడుపుతున్న మందుల దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నరసాపురంలో నడుస్తున్న అనుమతి లేని ఆసుపత్రి

ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

మహేశ్వరరావు, డిఎంహెచ్‌ఒ

నకిలీ వైద్యులపై ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికి ప్రభుత్వ వైద్యుల ద్వారా జిల్లాలోని ఆర్ఎంపి, పిఎంపిల వివరాలను సేకరిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు. జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేసి నకిలీ వైద్యులను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

అదానీని వెంటనే అరెస్టు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - పోడూరు

ఒప్పందాలకు అదానీ గ్రూపు ముడుపులు చెల్లించడాన్ని నిరసిస్తూ, అదానీని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక సినిమా హాలు సెంటర్‌లో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ కారం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం అదానీ గ్రూప్‌తో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నింటినీ రద్దు చేసుకోవాలని, వారికి కేటాయించిన భూమిని, ప్రజలను సంపదను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమెరికా న్యాయస్థానాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా అదానీపై కేసు నమోదు చేసి గౌతమ్ అదానీని ఇతరులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు పిల్లి ప్రసాద్, బూరాబత్తుల వెంకట్రావు, కొడమంచిలి సూర్య, బి.శ్రీనివాస్, సత్యం పెద్దిరాజు, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

పోడూరులో ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

ఉండి: సెకి నుంచి విద్యుత్ ఒప్పందాలు చేసుకునేందుకు గత వైసిపి ప్రభుత్వానికి సుమారు రూ.1750 కోట్లు లంచాలు ఇచ్చిన గౌతమ్ అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వంతో అదానీ గ్రూపు చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్ఒబి ప్రాంతంలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితుడైన గౌతమ్ అదానీ అవినీతి, అక్రమాల భాగోతం అమెరికాలో బయటపడి అక్కడ కేసు నమోదైనప్పటికీ మోడీ నోరు తెరవకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇంత పెద్ద మొత్తంలో లంచాలను ముఖ్యమంత్రులకు, మంత్రులకు, అధికారులకు ఇవ్వడం వల్ల ప్రజలపై ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరిట భారాలు మోపుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అదానీ సంస్థకు కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలని, విశాఖ డేటా సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని, ఇప్పటి వరకు ప్రజల నుంచి అదానీ సంస్థ కొల్లగొట్టిన ప్రజల సంపదను వెనక్కి తీసుకోవాలని, అదానీ గ్రూపు అక్రమాలను వెలికి తీసేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అదానీ గ్రూపు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం స్పందించి అమెరికా న్యాయస్థానాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆర్థిక నేరస్తుడైన అదానీపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చీర్ల శేషగిరిరావు, నేతలు ధనికొండ శ్రీనివాస్, నిమ్మితి కిషోర్, వీరవల్లి మాధవరావు, రామకూరి వెంకటరత్నం, కింతాడ రమేష్, చిప్పాడ బుచ్చేశ్వరరావు, వీరవల్లి వెంకటరత్నం, కిలారి తవిటి నాయుడు, కాల్వ ఏసు, మజ్జి నాగేశ్వరరావు, పెళ్లూరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ మండల కమిటీ నేతలు

ఎంఎల్‌సిగా గోపీమూర్తిని గెలిపించండి

మండలంలో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కాళ్ల

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తికి ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ యుటిఎఫ్ మండల కమిటీ మండలంలో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించింది. ఏలూరుపాడు, జువ్వలపాలెం, ప్రాతాళ్లమెరక, కలవపూడి, కాళ్లకూరు, దొడ్డనపూడి, కాళ్ల, బొండాడ, కోపల్లె, జక్కరం, పెదఅమిరం గ్రామాల్లోని ఉపాధ్యాయ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, మండల అధ్యక్షులు బిఆర్ఎంకె.స్వామి, మండల ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్రావు, మండల సహాధ్యక్షులు పి.ప్రభుదాస్ పాల్గొన్నారు.

నూరుశాతం ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

'బేస్‌మెంట్ ఇల్లు కట్టు.. లక్ష పట్టుకెళ్లు' అంటూ ప్రచారం

జిల్లాలో పిఎంఎవై 2.0 పథకం ప్రారంభం

ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలు రుణం మంజూరు

పిఎంఎవై 1.0లో ఇప్పటి వరకు 30,293 ఇళ్ల నిర్మాణం పూర్తి

లబ్ధిదారుల ఖాతాల్లో రూ.609 కోట్లు జమ

గృహ నిర్మాణ శాఖ జిల్లా ఇన్‌ఛార్జి పీడీ జి.పిచ్చియ్య

ప్రజాశక్తి - భీమవరం

వచ్చే ఏడాది మార్చి 31 నాటికి జిల్లాలో ఇళ్ల నిర్మాణం నూరు శాతం పూర్తి చేయడమే తమ లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ జిల్లా ఇన్‌ఛార్జి పీడీ జి.పిచ్చియ్య తెలిపారు. 'బేస్‌మెంట్ లెవెల్ ఇల్లు కట్టు.. రూ.లక్ష పట్టుకెళ్లు' అనే నినాదంతో ప్రచారం సాగిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. జిల్లాలో పిఎంఎవై 2.0 నూతన పథకం ప్రారంభమైందని, లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. పిఎంఎవై 1.0 పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 30,293 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందని, లబ్ధిదారుల ఖాతాల్లో రూ.609 కోట్లు జమ చేశామని చెప్పారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణం, వివిధ దశల్లో ఉన్న నిర్మాణాల పరిస్థితి, లబ్ధిదారులకు అందిస్తున్న సహకారం, పిఎంఎవై 2.0 పథకం అమలు తదితర అంశాలపై హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ పిచ్చియ్య ప్రజాశక్తి ముఖాముఖిలో మాట్లాడారు.

ప్రశ్న: జిల్లావ్యాప్తంగా ఎన్ని ప్రభుత్వ లేఅవుట్లు ఉన్నాయి?

పీడీ: జిల్లావ్యాప్తంగా 20 మండలాలు, పట్టణ ప్రాంతాల పరిధిలో 620 ప్రభుత్వ లేఅవుట్లు ఉన్నాయి.

ప్రశ్న: జిల్లాలో ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వ, సొంత భూముల్లో లబ్ధిదారులు ఎంతమంది, ఇప్పటివరకు ఎన్ని ఇళ్ల నిర్మాణం చేపట్టారు?

పీడీ: పిఎంఎవై 1.0 పథకంలో జిల్లావ్యాప్తంగా సుమారు 70,119 మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వ లేఅవుట్‌లో 47,362 మంది, సొంత భూముల్లో ఇళ్ల నిర్మించుకునేవారు మరో 22,757 మంది ఉన్నారు. ఇప్పటి వరకూ జిల్లావ్యాప్తంగా 30,293 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది.

ప్రశ్న: ఇళ్ల నిర్మాణం ప్రారంభమై వివిధ దశల్లో ఎన్ని ఉన్నాయి. నిర్మాణాలు చేపట్టాల్సినవి ఎన్ని ఉన్నాయి?

పీడీ: శ్లాబ్ దశలో 1392 ఇళ్లు, రూఫ్ లెవెల్‌లో 1484, లెంటల్ దశలో 2434, బేస్‌మెంట్ దశలో 5381, ప్లీట్ బీముల దశలో 1883, కాంక్రీట్ దశలో 1503, బిపిఎల్ దశలో 2,206 దశలో ఉన్నాయి. అలాగే 25,543 ఇళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

ప్రశ్న: ఇళ్ల నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు ఎంత చెల్లించారు?

పీడీ: జిల్లావ్యాప్తంగా 30,293 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశాం. వీటి నిమిత్తం ఇప్పటి వరకూ రూ.609 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం. ఎటువంటి పెండింగ్ లేకుండా సొమ్ము జమ చేస్తున్నాం.

ప్రశ్న: జిల్లాలో పిఎంఎవై 2.0 పథకం ఎప్పుడు ప్రారంభించారు. లబ్ధి పొందేందుకు అర్హతలు ఏమిటీ, ఈ పథకంలో లబ్ధిదారులకు రుణం ఎంత అందిస్తున్నారు?

పీడీ: ఈ నెల 20 నుంచి జిల్లాలో పిఎంఎవై 2.0 పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంలో చాలామంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. రూ.3 లక్షల్లోపు ఆదాయం, ఆధార్, రేషన్ కార్డు కలిగి ఉండాలి. అలాగే రెండున్నర ఎకరాలు మాగాణి, ఐదెకరాల మెట్ట భూమి ఉన్నా ఈ పథకానికి అర్హులే. గతంలో పిఎంఎవై 1.0లో ఇంటికి రూ.లక్షా 80 వేలు అందిస్తే ప్రస్తుతం పిఎంఎవై 2.0 పథకంలో రూ.2.50 లక్షలు రుణాన్ని లబ్ధిదారులకు అందిస్తున్నాం. దీనిలో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.లక్షా 50 వేలు, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.లక్ష చొప్పున లబ్ధిదారులకు అందించామన్నారు.

ప్రశ్న: ఇళ్ల నిర్మాణదారులను ప్రోత్సహించేందుకు అదనంగా రుణాలు ఏమైనా అందిస్తున్నారా?

పీడీ: ప్రభుత్వం అందించే రుణంతోపాటు అదనంగా రుణాలను అందించి గృహ నిర్మాణదారులను ప్రోత్సహిస్తున్నాం. గతంలో డ్వాక్రా సంఘాల ద్వారా రూ.35 వేలు అందిస్తే ప్రస్తుతం రూ.లక్ష వరకు రుణం మంజూరు చేస్తున్నాం. అలాగే ఐఎఫ్ఎఫ్ఎల్ బ్యాంకు ద్వారా లబ్ధిదారుని భూమికి సంబంధించిన డాక్యుమెంట్ తీసుకుని మరో రూ.3 లక్షలు రుణం అందిస్తున్నాం. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

ప్రశ్న: ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టారు?

పీడీ: జిల్లాలో ఎక్కువ బేస్‌మెంట్ దశలో ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయి. ప్రభుత్వం ద్వారా తీసుకున్న రుణం కొంత బేస్‌మెంట్ వరకు ఖర్చు చేసినప్పటికీ మరికొంత గృహనిర్మాణ శాఖ వద్ద ఉంది. అందుకే 'బేస్‌మెంట్ లెవెల్ ఇల్లు కట్టు.. రూ.లక్ష పట్టుకెళ్లు' అనే నినాదంతో ముందుకెళ్తున్నాం. ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామస్థాయిలో సర్పంచులు, అధికారుల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా ఇల్లు నిర్మించుకుని సొంతింటి కల నెరవేర్చుకోవాలి. జిల్లాలో మంజూరైన అన్ని ఇళ్లు, వివిధ దశల్లో ఉన్న ఇళ్లు మొత్తం వచ్చే మార్చి 31లోపు నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

ప్రజాసమస్యల పరిష్కారానికి సిపిఎం కృషి

సిపిఎం మండల మహాసభలో నేతలు

ప్రజాశక్తి - పెంటపాడు

ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం నిరంతరం కృషి చేస్తోందని సిపిఎం జిల్లా నేతలు చింతకాయల బాబూరావు, కర్రి నాగేశ్వరరావు, రాజా రామ్మోహన్‌రాయ్ తెలిపారు. సిపిఎం 7వ పెంటపాడు మండల మహాసభ యానాలపల్లి గ్రామంలో ఎస్‌సి కమిటీ హాల్లో జై.శ్యామల కుమారి, బంకురు నాగేశ్వరరావు, మరపట్ల దానయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముందుగా మరమట్ల దానయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూడేళ్ల కాలంలో పార్టీ నిర్వహించిన కార్యక్రమాల నివేదికను మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి ప్రవేశపెట్టారు. ఈ నివేదికను మండల సభ్యులు చర్చించి ఆమోదించారు. ఈ మహాసభకు పార్టీ జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, కర్రి నాగేశ్వరరావు, జిల్లా నేత కె.రాజా రామ్మోహన్ రాయ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సెక్రటేరియట్ సభ్యులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం నిరంతరం కృషి చేస్తోందన్నారు. నిత్యం స్థానిక సమస్యలపై పోరాటాలు చేస్తూ, పార్టీని విస్తృతం చేయాలన్నారు. మోడీ వైఫల్యం వల్లే పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసరాలు ధరలు పెరిగాయన్నారు. తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దూలం ప్రసాద్, ఎండ పెద్దిరాజు, పనసల సత్యనారాయణ, బంగారయ్య, వడ్డీ సత్యనారాయణ, పెనగంటి దుర్గ పెంటారావు, ఆర్.అనురాధ, ముల్లు సీత, మాదాసు శ్రీను, గాది వెంకట్రావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజా రామ్మోహన్ రాయ్

ముదునూరులో ఆర్‌టిసి బస్సు బోల్తా

ఇద్దరికి గాయాలు - తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెంటపాడు మండలం ముదునూరు సమీపంలో ఆర్‌టిసి బస్సు రోడ్డుపక్కనే ఉన్న బోదెలోకి బోల్తా పడిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మహిళా కండక్టర్, ఒక ప్రయాణికునికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఆర్‌టిసి తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వై.సూర్యనారాయణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం డిపోకు చెందిన బస్సు సాయంత్రం ఐదు గంటలకు తాడేపల్లిగూడెం నుంచి 20 మంది ప్రయాణికులతో భీమవరం వెళ్తోంది. ముదునూరు సమీపంలోకొచ్చేసరికి స్టీరింగ్ పట్టినట్లు అనిపించి డ్రైవర్ బ్రేక్ వేశారు. ఈ క్రమంలో బస్సు అదుపు తప్పి ఎడమ పక్కనే ఉన్న పంట బోదెలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మహిళా కండక్టర్ బి.శాంతకుమారి కాలుపైకి బస్సులోని స్టెఫినీ టైర్ పడటంతో కాలికి గాయమైంది. మరో ప్రయాణికుని తలకు స్వల్ప గాయమైంది. వీరిని 108 అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మిగిలినవారికి గాయాలు కాకపోవడంతో మరో బస్సులో తమ గమ్యస్థానాలకు బయల్దేరి వెళ్లారు. బస్సు వేగం తక్కువగా ఉండటం, బోదెలోకి బోల్తా పడి బస్సు ఆగిపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ బస్సు కండిషన్‌పైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బోల్తా పడిన బస్సు

ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

మండల మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - పెనుమంట్ర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు సమిష్టిగా తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం ఎనిమిదో మండల మహాసభ పొలమూరు గ్రామంలో జరిగింది. తొలుత పార్టీ పతాకాన్ని మంగం సూర్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం అమరజీవులకు మహాసభ నివాళులర్పించింది. అనంతరం జరిగిన సభకు కె.పద్మజ, నేతల నాగేశ్వరరావు, కె.ప్రసాద్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముఖ్యవక్త జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ దేశంలో అవినీతి వ్యవస్థీకృతమైందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే వ్యవసాయ చట్టాలు తీసుకొస్తే రైతులంతా ఐక్యంగా తిప్పికొట్టారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందని గోపాలన్ విమర్శించారు. రాష్ట్రంలో గత వైఎస్ఆర్ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దుర్మార్గ విధానాలకు వంత పాడుతున్నాయన్నారు. మన రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపిని ఏవిధంగానూ విమర్శించడానికి సాహసించే పరిస్థితి అధికార, ప్రతిపక్ష పార్టీల్లో నెలకొనడం బాధాకరమన్నారు. సిపిఎం మండల కార్యదర్శి కె.సుబ్బరాజు మూడేళ్ల కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టగా ప్రతినిధులు చర్చించి ఆమోదం తెలిపారు. సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, నేతలు సూర్నీడి వెంకటేశ్వరరావు, ఆకుల హరేరామ్, నేతల చిత్తరంజన్, చింతపల్లి తిరుమలరావు, రాపాక ఆశీర్వాదం తదితరులు మాట్లాడారు.

మాట్లాడుతున్న కేతా గోపాలన్

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పద్మజ

మెంటేవారితోటలో ఉచిత మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరంలోని మెంటేవారితోట పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద బిపి, షుగర్, ఫిట్స్, పెరాలసిస్ పేషెంట్లకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వంద మంది పేషెంట్లు ఈ క్యాంపును వినియోగించుకున్నట్లు తెలిపారు. ఈ క్యాంపు రెండేళ్లుగా ప్రతి మూడు నెలలకోసారి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ న్యూరో డాక్టర్ జిబిఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ గోపాలం శివన్నారాయణ ద్వారా జనరిక్ మందులు రూ.300లకే మూడు నెలలకు సరిపడా అందిస్తున్నామన్నారు. ఈ క్యాంపునకు విచ్చేసి తమ సహాయ సహకారాలు అందించిన డాక్టర్ జి.పద్మజ, డాక్టర్ సందీప్‌వర్మ, డాక్టర్ పి.సత్యనారాయణరాజుకు వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాదరాజు అభినందనలు తెలిపారు.

సిపిఎం మండల కార్యదర్శిగా నరసింహమూర్తి

ప్రజాశక్తి - గణపవరం

సిపిఎం మండల కార్యదర్శిగా పెచ్చెట్టి నరసింహమూర్తి ఎన్నికైనట్లు పార్టీ జిల్లా నాయకులు జె.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. సిపిఎం గణపవరం మండల 8వ మహాసభ స్థానిక బిటి రణదీవె భవనంలో జరిగింది. ఈ మహాసభలో నరసింహమూర్తి ఎన్నికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ రానున్న కాలంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. గణపవరంలో బొబ్బిలి వంతెన, కేశవరం వెళ్లే ఉండి కాలువపై కొత్తగా బెయిలీ వంతెన నిర్మించాలని తెలిపారు. మండలంలో ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరందించాలన్నారు. లింకు రోడ్లు, ప్రధాన రహదారులు వెంటనే నిర్మించాలన్నారు. ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. మండలంలో శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ మేరకు ప్రవేశపెట్టిన తీర్మానాలను మహాసభ ఆమోదించినట్లు తెలిపారు.

సిపిఎం మండల కన్వీనర్‌గా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - పోడూరు

సిపిఎం పోడూరు మండల కన్వీనర్‌గా కాకర వెంకటేశ్వర్లును ఆదివారం సిపిఎం పోడూరు మండల తొమ్మిదో మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ తెలిపారు. ఈ సందర్భంగా మండల సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. రైతులకు సాగునీరు అందించాలని, ధాన్యం డబ్బులు విడుదల చేయాలని, కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని, డంపింగ్ యార్డ్‌కు స్థల సేకరణ చేపట్టాలని తదితర వాటిని తీర్మానించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులుగా పిల్లి ప్రసాద్, మోడీ మోజేష్, కాటూరి ఏకోబు, కొడమంచిలి సూర్య, రాపాక వెంకటేశులు, ఎం.సత్యవతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గోపాలన్ తెలిపారు.

టిడిపి సభ్యత్వ నమోదుకు స్పందన : మంత్రి నిమ్మల

పాలకొల్లు రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలనూ మెప్పించే విధంగా పాలన అందిస్తున్నందు వల్లే టిడిపి సభ్యత్వ నమోదుకు పెద్ద ఎత్తున స్పందన వస్తోందని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం ఆగర్తిపాలెంలో జరిగిన టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టిడిపి శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు రాశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఇరవై ఐదు రోజుల్లో రాష్ట్రం మొత్తం మీద 46 లక్షల సభ్యత్వాలు నమోదు కాగా పాలకొల్లు నియోజకవర్గంలో 67,430 సభ్యత్వాలు నమోదే నిదర్శనం అన్నారు. ముఖ్యంగా అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణాలతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయి ప్రసాద్, శ్రీరెడ్డి బాబులు, నున్నబోయిన ప్రసాద్, నన్నుబోయిన సత్యనారాయణ, కోర వాసు, పీతల శ్రీను, నామవరపు రవి, శ్రీను పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్ కిటకిట

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం బీచ్ పర్యాటకులతో కిటకిటలాడింది. కార్తీకమాసం మూడో ఆదివారం సందర్భంగా పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాలపై బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర స్నానాలు చేశారు. డిఎస్‌పి శ్రీవేద పర్యవేక్షణలో సిఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నలుగురు ఎస్ఐలు, 90 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పంచాయతీ, రెవెన్యూ, మత్స్య, వైద్య తదితర శాఖల సిబ్బంది విధులు నిర్వహించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

తణుకు: వైద్యం కోసం సొంత సొమ్ముతో వైద్యం చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రీయంబర్స్‌మెంట్ చెక్కులను తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అందజేశారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 19 మంది బాధితులకు రూ.21,18,507 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ ఎవరైతే వైద్యం కోసం సొంత డబ్బుతో వైద్యం చేయించుకున్నారో వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రీయంబర్స్‌మెంట్ చేయిస్తున్నటుఉల తెలిపారు. ఈ సంవత్సరం జులైలో కురిసిన వర్షాలకు తణుకు మున్సిపల్ కార్మికుడు ఎల్లారి శ్రీనివాసరావు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారని, అప్పుడు ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.రెండు లక్షలు మంజూరు చేశారని, ఆ చెక్కును శ్రీనివాసరావు భార్యకు అందజేసినట్లు వివరించారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి నేతలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బెల్టుషాపు నిర్వాహకురాలు అరెస్టు

ఆచంట: బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో ఆచంటకు చెందిన బెల్టుషాపు నిర్వాహకురాలిని అదుపులో తీసుకుని ఆమె నుంచి 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పి.మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండ : బెల్టు షాపు నిర్వహిస్తున్న సిద్ధాంతం గ్రామానికి చెందిన మామిడిశెట్టి త్రిమూర్తులును అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ ఎస్.మణికంఠరెడ్డి గెలిపారు. అతని వద్ద నుంచి 5 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ బి.లక్ష్మి, ఆర్.మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌పై ఫిర్యాదు : కేసు నమోదు

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానికంగా ఓ ప్రయివేటు హైస్కూల్లో చదువుతున్న విద్యార్థిని తనపై ప్రిన్సిపల్ చేయి చేసుకున్నారంటూ స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పట్టణానికి చెందిన ధారబోయిన ఆదినారాయణ కుమార్తె అమృత ఆకివీడులోని హైస్కూల్లో 9వ తరగతి చదువుతోంది. ప్రతిరోజూ స్కూల్ బస్సులోనే పాఠశాలకు వెళ్తోంది. అయితే హైస్కూల్‌కు వస్తూ బస్సులో విద్యార్థిని ప్రిన్సిపల్‌ను విమర్శించినట్లుగా డ్రైవర్ ప్రిన్సిపల్‌కు తెలిపారు. దీంతో ప్రిన్సిపల్ ఆ విద్యార్థినిని పిలిపించి కొట్టారనీ అమృత ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వ్యాపారంలో శరవేగంగా భీమవరం అభివృద్ధి

మండలి ఛైర్మన్ మోషేనురాజు, ఎంఎల్ఎ అంజిబాబు - తంబుల్ డ్రై క్లీనర్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తంబుల్ డ్రై లాండ్రీ, డ్రై క్లీనర్‌ను ప్రారంభిస్తున్న మండలి ఛైర్మన్ , ఎంఎల్ఎ

వ్యాపార రంగంలో భీమవరం ఎంతో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, కార్పొరేట్ స్థాయి వ్యాపార సంస్థలు తరలొస్తున్నాయని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్థానిక జెపి రోడ్డులో నూతన తంబుల్ డ్రై లాండ్రీ, డ్రై క్లీనర్‌ను ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. మనిషి హుందతనాన్ని చూపించేవి బట్టలేనని, అటువంటి వాటిని మరింత అందంగా కనిపించేలా నూతన టెక్నాలజీతో కూడిన డ్రై క్లీనర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు పి.వెంకట్ నిశాంత్, చొప్పర్ల గుప్తా మాట్లాడుతూ తంబుల్ డ్రై కీనర్‌లో పలు సర్వీసులను అందిస్తున్నామన్నారు. లాండ్రీ, డ్రై, షూ, కార్పెట్, కర్టెన్స్, లగేజ్, హ్యాండ్‌బ్యాగ్ క్లీనింగ్ సర్వీసులు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని అంతా వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణాధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్, ప్రముఖులు పి.రామ్‌ప్రసాద్, చరణ్, దేవరపు పాండు, వబిలిశెట్టి కనకరాజు, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, జూలూరి వెంకటేష్, ఓలేటి బంగారావు, వెంకటరత్నం, గుండు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులంతా భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1983-84 బ్యాచ్ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి నిమిత్తం రూ.63,000 నగదును ఎంఎల్ఎ చేతుల మీదుగా పాఠశాల అభివృద్ధికి పనిచేస్తున్న ఎన్‌వి సత్యనారాయణకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాల అభివృద్ధికి చాలామంది భాగస్వాములయ్యారని, ప్రభుత్వం కూడా వారి భాగస్వామ్యాన్ని బలపరుస్తూ మరింత అభివృద్ధి చేసే దిశగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

ఫీజులపై విద్యార్థులను ఒత్తిడి చేస్తే కఠిన చర్యలు

యాజమాన్యాలకు కలెక్టర్ నాగరాణి హెచ్చరిక

ప్రజాశక్తి - భీమవరం

ఫీజు రీయంబర్స్‌మెంట్ సమస్యల కారణంగా ఏ ఒక్క విద్యార్థికీ హాల్‌టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాకుండా నిరోధించడం చేయరాదని సంబంధిత కళాశాలల యాజమాన్యాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. జిల్లాలోని ఏ డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలలోనైనా విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధిస్తే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళాశాల ఫీజు చెల్లించకపోవడం వల్ల కొంతమంది డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపల్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వకపోవడం, వారిని పరీక్షలను రాయనీకపోవడం జరుగుతోందని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. విద్యార్థుల సర్టిఫికెట్లను ఎలాంటి హోల్డ్ చేయకూడదని ప్రభుత్వం గైడ్‌లైన్స్ ఇచ్చిందని, ఎవరైనా కళాశాలల ప్రిన్సిపల్స్ విద్యార్థుల సర్టిఫికెట్లను హోల్డ్ చేస్తే సంబంధిత కళాశాలను బ్లాక్ లిస్టులో పెట్టడం, వారిపై జరిగే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఫీజును కళాశాలల అకౌంట్లలోకి జమ చేస్తుందని జిఒ ఇచ్చిందని, కళాశాలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఏ కళాశాలలోనూ విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులూ పెట్టరాదని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పట్టని వారికి మద్దతు తగదు

ఎస్‌టియుకి రాజీనామా చేసిన జిల్లా అడిషనల్ జనరల్ సెక్రటరీ జక్రియా

పిడిఎఫ్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని ప్రకటన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏనాడూ మాట్లాడని వ్యక్తికి ఎస్‌టియు ఎంఎల్‌సి ఎన్నికల్లో మద్దతు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆ సంఘానికి రాజీనామా చేసినట్లు ఎస్‌టియు జిల్లా అడిషనల్ జనరల్ సెక్రటరీ జక్రియా ప్రకటించారు. ఈ సందర్భంగా జక్రియాకు ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి యుటిఎఫ్ కండువా కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ ఏలూరు నగర శాఖ జక్రియాకు యుటిఎఫ్ సభ్యత్వం ఇచ్చింది. ఈ సందర్భంగా జక్రియా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై కనీస అవగాహన లేకుండా ఎన్నికల బరిలో నిలిచిన రాజకీయ అవకాశవాదులకు మద్దతుగా పని చేయడం ఇష్టం లేక ఎస్‌టియుకు రాజీనామా చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సమస్యల పట్ల అవగాహనతో, చిత్తశుద్ధితో పని చేసే పిడిఎఫ్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫా ఆలీ, రవికుమార్ రుద్రాక్షి పాల్గొన్నారు.

జక్రియాను యుటిఎఫ్‌లోకి ఆహ్వానిస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి, యుటిఎఫ్ నేతలు

ఘనంగా ఎన్‌సిసి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం

డిఎన్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో డిఎన్ఆర్ కళాశాల సీనియర్ డివిజన్ ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో 76వ ఎన్‌సిసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు డిఎన్ఆర్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు ముఖ్యఅతిథిగా హాజరై, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, 76వ ఎన్‌సిసి దినోత్సవ వేడుకల పెరేడ్‌ను సమీక్షించి, ఎన్‌సిసి క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏడున్నర దశాబ్దాలుగా యువతకు, ముఖ్యంగా విద్యార్థులకు మార్గ దర్శకత్వం వహిస్తూ ఎంతోమంది జీవితాలకు బంగారు బాటలు వేసిందన్నారు. ఈ వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ గాది రాజు సత్యనారాయణ రాజు (బాబు), పాలకవర్గ సంయుక్త కార్యదర్శి కె.రామకృష్ణంరాజు, డిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ జి.మోజెస్ మాట్లాడారు. అనంతరం జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన క్యాడెట్లకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అతిథులచేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమానికి కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎ.వీరయ్య పెరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు. కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు సిహెచ్ బోస్‌రాజు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామస్తులు ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం

కుముదవల్లి సర్పంచి వంశీకృష్ణంరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

గ్రామస్తులు ఆరోగ్యంగా ఉండాలన్నదే తన లక్ష్యమని కుమదవల్లి సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణంరాజు అన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద భూపతి రాజు వంశీకృష్ణంరాజు, భూపతిరాజు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో భీమవరం ఐడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వంశీకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి, పలువురికి కళ్ల జోళ్లు అందజేశారు. అనంతరం వంశీకృష్ణంరాజు మాట్లాడుతూ వైద్యం ఎంతో ఖరీదు అయ్యిందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పెన్మెత్స సూర్యసౌమిత్, నాయకులు శ్రీనివాసరాజు, సత్యనారాయణరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వైద్య సేవలందజేస్తున్న డాక్టర్

అప్పారావు ఆశయ సాధనకు పోరాటాలు చేయాలి

సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - వీరవాసరం



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

కిలాడి అప్పారావు ఆశయ సాధనకు ప్రజా పోరాటాలు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. కిలాడి అప్పారావు ఐదో వర్ధంతి సభ ఉత్తర పాలెం బిసి కమిటీ హాల్ వద్ద పాల అజయ్ ఘోష అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ అదాని వేల కోట్ల రూపాయల వ్యవహారంపై అమెరికా కోర్టులో కేసు నమోదు కావడం, ఆ కేసులో ఆంధ్ర రాష్ట్రం పేరు ఉండడంపై కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించాలన్నారు. భారీ అవినీతి అక్రమాలకు పాల్పడిన అదానీని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అదానీ గ్రూపుతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న అన్ని రకాల ఒప్పందాలను తక్షణం రద్దు చేయాలన్నారు. అదానీ గ్రూపు అక్రమాలపై హైకోర్టులో విచారణ జరపాలన్నారు. గ్రామాల్లో నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై, రోజు రోజుకు పెరుగుతున్న అధిక ధరలకు వ్యతిరేకంగా పోరాటం చేయడం ద్వారానే అప్పారావు ఆశయాలు నెరవేరతాయన్నారు. శుద్ధి చేసిన తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ , రోడ్ల మరమ్మతులు , కాలనీ రోడ్లు వేయాలని తదితర సమస్యలపై ప్రజలను సమీకరించి ఆందోళన చేయడం ద్వారానే గుర్తింపు పొందారన్నారు. ఇసుక ప్రజలకు అందని ద్రాక్షలా ఉందని, ప్రభుత్వం ఎన్ని సమీక్షలు చేసినా ర్యాంపుల్లో దోపిడీ తప్పడం లేదని విమర్శించారు. రానున్న కాలంలో ప్రజా పోరాటాలు ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాలా కోటేశ్వరరావు, కిలాడి సత్యనారాయణ, జుత్తిగ శ్రీనివాస్, అయినపూడి బాబూరావు, బండి నారాయణమూర్తి, జుత్తిగ సాంబియాంబ, పాల నర్సయ్య పాల్గొన్నారు.

పలుచోట్ల వన సమారాధనల సందడి

ప్రజాశక్తి - ఆచంట

పాలకొల్లు : మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కార్తీకమాసం ఆఖరి ఆదివారం కావడంతో గోదావరి తీర ప్రాంతాలైన సిద్ధాంతం, పెదమల్లం, కోడేరు గ్రామాల్లో కార్తీక వన సమారాధనలు పెద్ద ఎత్తున నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వివిధ సంఘాలు, కులాలకు చెందిన వారు, విద్యార్థులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ముందుగా సాంప్రదాయబద్ధంగా ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పలువురు గోదావరిలో పడవలపై విహరిస్తూ నది అందాలు తిలకించారు. గోదావరి మధ్యలో ఉన్న ఇసుక తిన్నెలపై కేరింతలు కొట్టారు. కృష్ణదేవరాయలు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆచంట, కొడమంచిలి, పెనుమంచిలి గ్రామాల్లో లక్ష పత్రి పూజ నిర్వహించి అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పాలకొల్లు : కందుకూరి వీరేశలింగం పంతులు గొప్ప సంఘ సంస్కర్త అని ప్రముఖ సాహితీవేత్త కానుకొలను శ్రీనివాసరావు అన్నారు. పాలకొల్లు రసధుని సాహితీ కార్యక్రమ సభ, కార్తీక మాస వన సమారాధన కార్యక్రమం స్థానిక సరస్వతి విద్యాపీఠంలో ఘనంగా నిర్వహించారు. కందుకూరి వీరేశలింగం ఆనాటి సమాజంలో ఉన్న పరిస్థితులను సంస్కరించాలని తలపెట్టిన సంస్కరణలు నేటికీ మరువరానివని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన రసధుని అధ్యక్షులు కొట్టి భాస్కరరావు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి సాహిత్య కార్యక్రమాలను ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. సభలో పి.లక్ష్మీనారాయణ, మద్దాల వాసు, ఉన్నమట్ల కపర్థి, దంగేటి గోపాలకృష్ణ, కోలాటి పెద్దిరాజు, చేగొండి రంగారావు పాల్గొన్నారు.

మొగల్తూరు : సంఘస్థులందరూ తమ పిల్లలను విద్యావంతులను చేయడంతో పాటు ఐక్యమత్యంగా ఉండాలని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మొగల్తూరులోని జాతీయ రహదారి పక్కన ఉన్న కుక్కల నాగేశ్వరరావు లేఔట్‌లో నవుడూరు వారి గురువు సంఘం ఆధ్వర్యంలో 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కార్తీక వన సమారాధనను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, బిజెపి క్రమశిక్షణ సంఘ నాయకుడు పాక సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. అలాగే ముత్యాలపల్లి గ్రామంలో కాపు కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు హాజరయ్యారు. గాయత్రి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనను మొగల్తూరులో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బ్రాహ్మణులంతా శిష్ట సత్యనారాయణ సోదరుల ఇంటి ఆవరణలో ఉసిరి చెట్టు కింద నిర్వహించిన రమాసత్యనారాయణ స్వామి వ్రతం, కార్తీక దామోదర పూజలు నిర్వహించారు.

పాలకొల్లు : పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ సారధ్యంలో ఆదివారం కళ్యాణ మండపంలో నిర్వహించిన క్షత్రియ పరిషత్ వన సమారాధనకు మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. దీనిలో ఎటువంటి రాజకీయ అంశాలపై ఎవరు మాట్లాడకపోవడంతో సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజుతో పాటు ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, మాజీ ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, మాజీ ఎమ్మెల్సీలు మేకా శేషుబాబు, అంగర రామ్మోహన్ పాల్గొన్నారు. క్షత్రియులు ఉన్న చోట అభివృద్ధి, సంక్షేమం ఉంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఛక్మిర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, కెవి కృష్ణవర్మ, కెవి సీతారామ రాజు పాల్గొన్నారు.

చదరంగంతో మేధాశక్తి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పాలకొల్లు

చదరంగం వల్ల పిల్లల మేధాశక్తి, ఏకాగ్రత పెంపొందుతాయని నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. పాలకొల్లు యూరో కిడ్స్ స్కూల్లో ఆదివారం జిల్లాస్థాయి చదరంగ పోటీలను ఆర్‌డిఒ ప్రారంభించారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ర్యాపిడ్ చదరంగ పోటీలు 2024 జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఇటువంటి పోటీలకు ఆతిథ్యం ఆనందంగా ఉందని యూరికిడ్స్ డైరెక్టర్ మద్దుల రాజేష్ అన్నారు. ఈ పోటీల్లో విజేతలను డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి ర్యాపిడ్ చదరంగం పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా చెస్ అసోషియేషన్ అధ్యక్షులు మాదాను కిషోర్ తెలిపారు. ఈ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా రవిప్రసాద్, సురేష్, రాణి వ్యవహరించారు.

26 నుంచి పాలకొల్లు, నరసాపురం రోడ్డు రాకపోకలు షురూ

ప్రజాశక్తి - పెనుమంట్ర

గడిచిన నెల రోజులుగా మార్టేరులో సిమ్మెంట్ రోడ్డు నిర్మాణ పనుల కారణంగా పాలకొల్లు - నరసాపురం రోడ్డు గుండా రాకపోకలు నిలిపివేశారు. ఈ మేరకు ఈ నెల 26వ తేదీ మంగళవారం ఉదయం నుంచి రాకపోకలు యథావిధిగా కొనసాగనున్నట్లు ఆర్‌అండ్‌బిఇఇ పి.యశ్వంత్ తెలిపారు. కోటీ యాభై లక్షల వ్యయంతో మార్టేరు సెంటర్లోని వంతెన నుంచి శ్రీ కనకదుర్గమ్మ గుడి వరకూ చేపట్టిన డబుల్ వే సిమ్మెంట్ రోడ్డు పనులు పూర్తయ్యాయని తెలిపారు. వాటర్ కూంబింగ్ పనులు కూడా పూర్తయ్యాయని తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికలతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్య నిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో సిబ్బంది పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎక్కడైనా ప్రజల శాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సిఐ నాగరాజు హెచ్చరించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఆదివారం శాంతిభద్రతల పరిరక్షణ, నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గలవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. నిత్యం నిఘా ఉంటుందని, ఇకపై నేరాలకు పాల్పడకుండా సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ఎటువంటి ఫిర్యాదు వచ్చినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

శ్రీనివాసవర్మకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - ఆచంట

విలువలు నిబద్ధత కలిగిన రాజకీయ నాయకుడిని దేశానికి అందించిన మహోన్నత వ్యక్తి భూపతి రాజు సూర్యనారాయణ రాజు అని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ తండ్రి సూర్యనారాయణ రాజు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ ఆదివారం కలిసి పరామర్శించి సానుభూతి తెలిపారు. తొలుత భూపతి రాజు సూర్యనారాయణ రాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వినియోగదారుల కార్పొరేషన్ ఛైర్మన్ పీతల సుజాత, మాజీ ఎంఎల్ఎ, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, మాజీ డిసిసిబి అధ్యక్షులు వేండ్ర వెంకటస్వామి, బిజెపి జిల్లా అధ్యక్షులు ఉన్నారు.

నారుమడులకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి - నరసాపురం

డిసెంబరు 15వ తేదీ నాటికి దాళ్వా నారుమళ్లు వేసేందుకు రైతులు సన్నద్ధం కావాలని వ్యవసాయశాఖ ఎడిఎ డాక్టర్ అనిల్ కుమారి అన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సార్వా కోతలు పూర్తవ్వగానే రైతులు ఎంటియు 1121, 453, 1156 రకాల విత్తనాలను సాగు చేయాలని పేర్కొన్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి కోతలు వచ్చేలా చూడాలని తెలిపారు. వెదజల్లే, డ్రమ్ సీడర్, నాట్లు వేసే యంత్రాలద్వారా సాగు చేయడం వల్ల పది రోజులు ముందుగానే కోతలు వస్తాయని తెలిపారు. కలుపు మొక్కల నివారణకు గానూ 2-4డీ,సోడియం సాల్ట్ ఎకరాకు 500గ్రాములు చొప్పున పిచికారీ చేయాలని అనిల్ కుమారి సూచించారు.

గోరింటాడలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ పాలకొల్లు వారి ఆధ్వర్యంలో గోరింటాడలో హైస్కూల్ వద్ద ఆదివారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో పాలకొల్లు టౌన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నుంచి ఎముకల వైద్య నిపుణులు నారిన హర్ష, జనరల్ మెడిసిన్ డాక్టర్ కార్తీక్, స్త్రీల వైద్య నిపుణులు లక్ష్మి ప్రసన్న, చర్మ వ్యాధి నిపుణులు జక్కంపూడి సుభాషిని, దంత వైద్య నిపుణులు పెనుమాక భార్గవి సేవలందించారు. సుమారు 200 మందికి వైద్య సేవలందించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు జక్కంపూడి మాధవ్, కార్యదర్శి వేరుకొండ దుర్గాప్రసాద్, సిరిగినీడి నాగార్జున, పోకల రాము, గంథం ఏసుపాదం, గుండుమోగుల వీరాస్వామి పాల్గొన్నారు.